# న్యూస్‌క్లిక్ ఆఫీస్ సీజ్


- సంస్థ వ్యవస్థాపకుడు ప్రబీర్ అరెస్ట్
- సంస్థ కార్యాలయం, జర్నలిస్టుల నివాసాల్లో ఢిల్లీ పోలీసుల తనిఖీలు
- 5 నగరాలు, 100 ప్రాంతాల్లో 500 మంది పోలీసుల సోదాలు
- సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం
- మీడియా గొంతునొక్కే ప్రయత్నమే
- విపక్షాలు, జర్నలిస్టు సంఘాల ఆగ్రహం



న్యూఢిల్లీ, అక్టోబర్ 3: ప్రముఖ ఆన్‌లైన్ న్యూస్ పోర్టల్ న్యూస్‌క్లిక్ సంస్థపై ఢిల్లీ పోలీసులు ఉక్కుపాదం మోపారు. సంస్థ కార్యాలయం, జర్నలిస్టుల ఇండ్లలో మంగళవారం ఉదయం నుంచి సోదాలు చేపట్టారు. అనంతరం సంస్థ కార్యాలయాన్ని సీజ్ చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థను అరెస్ట్ చేశారు. ఆయనతోపాటు సంస్థ హెచ్‌ఆర్ హెడ్ అమిత్ చక్రవర్తిని అదుపులోకి తీసుకున్నారు. చైనాకు అనుకూలంగా వ్యవహరిస్తూ ఆ దేశం నుంచి నిధులు స్వీకరించినట్టు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో పోలీసులు ఉగ్రవాద వ్యతిరేక చట్టం (యూఏపీఏ) కింద న్యూస్‌క్లిక్‌పై కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగానే సోదాలు జరిపారు.

**5 నగరాలు.. 100 ప్రాంతాలు.. 500 మంది పోలీసులు**

దాడుల విషయాన్ని రహస్యంగా ఉంచారు. ఉదయం 2 గంటల సమయంలో స్పెషల్ సెల్ పోలీసులు లోధీ కాలనీలోని కార్యాలయంలో సమావేశమయ్యారు. విషయం లీక్ కాకుండా ఉండేందుకు సీనియర్ స్థాయి అధికారులు మినహా.. జూనియర్ అధికారుల ఫోన్లను ఆఫీసులోనే ఉంచినట్టు సమాచారం. ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్, ముంబై, గురుగ్రామ్ నగరాల్లో దాదాపు 100 ప్రాంతాల్లో సుమారు 500 మంది పోలీసులు తనిఖీల్లో పాల్గొన్నారు. నోయిడా ఎక్స్‌టెన్షన్‌లోని జర్నలిస్టు అభిసర్ శర్మ ఇంట్లో సోదాలు జరిపిన పోలీసులు సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను సీజ్ చేశారు. అభిసర్ శర్మను ప్రశ్నించడానికి తీసుకెళ్లారు. జర్నలిస్టు ఉర్మిలేశ్‌ను కూడా స్పెషల్ సెల్ కార్యాలయానికి తీసుకెళ్లారు. విదేశీ పర్యటనలు, షాహీన్ బాగ్, రైతుల నిరసనలు తదితర వాటికి సంబంధించి దాదాపు 25 ప్రశ్నలను వీరిని అడిగినట్టు సమాచారం. వీరితోపాటు జర్నలిస్టులు అనునిన్ద్యో చక్రవర్తి, పరంజాయ్ గుహ ఠాకుర్తా తదితరులను కూడా ప్రశ్నించారు. నిధుల ఆరోపణలపై గతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు చేపట్టిందని అధికారులు చెప్పారు. ఆ సంస్థ ఇచ్చిన సమాచారం మేరకు తాజాగా తాము సోదాలు జరిపామని తెలిపారు. కేంద్ర సమాచార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ స్పందిస్తూ కేంద్ర దర్యాప్తు సంస్థలు స్వతంత్రమైనవని, అవి చట్ట ప్రకారం తమ పని తాము చేసుకుంటూ పోతాయని పేర్కొన్నారు.



ఢిల్లీలోని న్యూస్‌క్లిక్ కార్యాలయాన్ని సీజ్ చేసిన ఢిల్లీ పోలీసులు



న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్‌ను అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న పోలీసులు

**ఏచూరి నివాసంలోనూ**

ఢిల్లీలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నివాసంలోనూ సోదాలు జరిగాయి. ఆయన సిబ్బందిలో ఒకరైన శ్రీనారాయణ్ కుమారుడు సుమిత్ న్యూస్‌క్లిక్‌లో పనిచేస్తున్నారు. ముంబైలో సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్ నివాసంలోనూ తనిఖీలు చేపట్టారు.

**మీడియా గొంతు నొక్కడమే**

సోదాలను ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, జర్నలిస్టు సంఘాలు, రాజకీయ పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఇది మీడియా గొంతు నొక్కడమేనని జర్నలిస్టు సంఘాలు విమర్శించాయి. ప్రతిపక్ష ఇండియా కూటమి స్పందిస్తూ నిజం మాట్లాడేవారిపై ఇలాంటి దాడులు జరుగుతున్నాయని, ద్వేషం, విభజనను వ్యాప్తి చేసేవారిపై దాడులు జరుగడం లేదని తెలిపింది. రానున్న ఎన్నికల్లో బీజేపీ ఓటమికి ఈ సోదాలే నిదర్శనమని ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలంగా ఉన్న మీడియా సంస్థలకు కోట్ల రూపాయల ప్రకటనలు ఇస్తున్నదని, దీనిపై ఎందుకు స్పందించరని నిలదీశారు. జర్నలిస్టులంటే బీజేపీకి భయమని, అందుకే ఇలాంటి సోదాలు జరుపుతున్నదని ఆప్ ధ్వజమెత్తింది.



----

## హైదరాబాద్ అంబేద్కర్ విగ్రహానికి అమెరికాలో ప్రతిరూపం

**మేరీల్యాండ్‌లో 19 అడుగుల 'స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ'**
**ఈ నెల 14న ఆవిష్కరణ**

న్యూయార్క్, అక్టోబర్ 3: హైదరాబాద్‌లో నిర్మించిన ప్రపంచంలోని అతి పెద్ద 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి ప్రతిరూపాన్ని అమెరికాలో ఏర్పాటు చేశారు. వైట్‌హౌస్‌కు 21 మైళ్ల దూరంలోని మేరీలాండ్ రాష్ట్రం అకోకీక్ నగరంలో 13 ఎకరాల విస్తీర్ణంలో స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ (సమతా మూర్తి) పేరుతో నిర్మించిన ఈ 19 అడుగుల విగ్రహాన్ని ఈ నెల 14న ఆవిష్కరించనున్నారు. ఇది భారత్‌దేశం వెలుపల నిర్మించిన అతిపెద్ద అంబేద్కర్ విగ్రహమని అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్ నిర్వాహకులు తెలిపారు. సమానత్వం, మానవ హక్కులు, సాధికారితకు అంబేద్కర్ విశేష కృషి చేశారని, ఆయన గౌరవార్థం ఈ విగ్రహాన్ని నిర్మించినట్టు చెప్పారు. 14న ఉదయం 10 గంటలకు విగ్రహావిష్కరణ జరుగుతుందని, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అహ్మదాబాద్‌లో అతిపెద్ద సర్దార్ పటేల్ విగ్రహాన్ని తయారు చేసిన పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ శిల్పి రామ్ సుతార్ ఈ విగ్రహాన్ని రూపొందించారని వెల్లడించారు.

## ఆగని మహా మృత్యుఘోష

- ఔరంగాబాద్‌లో 18 మంది మృతి
- నాందేడ్‌లో మరో ఏడుగురు
- 48 గంటల్లో 49 మంది మృతి

ముంబై: మహారాష్ట్రలోని ప్రభుత్వ దవాఖానల్లో మరణాలు ఆగడం లేదు. నిన్న నాందేడ్.. నేడు ఔరంగాబాద్ దవాఖానలో రోజూ పదుల సంఖ్యలో రోగులు ప్రాణాలు కోల్పోతున్నారు. రాష్ట్రంలో 48 గంటల వ్యవధిలో రెండు ప్రభుత్వ దవాఖానాల్లో 49 మరణాలు చోటుచేసుకున్నాయి. సరైన వైద్య సేవలు, ఔషధాలు, వైద్య పరికరాలు లేకపోవటం రోగుల వరుస మరణాలు కారణమని ప్రతిపక్షాలు ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వంపై మండిపడుతున్నాయి. ఔరంగాబాద్ ఛత్రపతి శంభాజీనగర్‌లోని ప్రభుత్వ దవాఖానలో 24 గంటల వ్యవధిలో (మంగళవారం ఉదయం 8గంటల నాటికి) 18 మందికిపైగా రోగులు మృత్యువాత పడ్డారు. ఇందులో ఇద్దరు నవజాత శిశువులు ఉన్నారని అధికారులు వెల్లడించారు.

**నాందేడ్‌లో 31 చేరిన మృతుల సంఖ్య**

నాందెడ్ జిల్లా దవాఖానలో మరో ఏడుగురు చనిపోగా, మొత్తం మృతుల సంఖ్య 31కి చేరుకుంది. జిల్లా సమాచార అధికారి విడుదల చేసిన వివరాల ప్రకారం, సెప్టెంబర్ 30–అక్టోబర్ 1 మధ్య 24 గంటల్లో 24 మంది పేషెంట్లు మరణించారు. ఇదే దవాఖానలో అక్టోబర్ 1–2 మధ్య మరో ఏడు మరణాలు చోటుచేసుకున్నాయి. దవాఖానలో వరుస మరణాలపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. పేదల బతుకులకు విలువ లేదా? అని ప్రశ్నించాయి. 'బీజేపీ నేతృత్వంలోని ట్రిపుల్ ఇంజిన్ సర్కారే ఈ మరణాలకు బాధ్యత వహించాలి' అని మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్ విమర్శించారు.

## ఆటోసెకండ్‌పై పరిశోధనలకు నోబెల్

- భౌతికశాస్త్రంలో ముగ్గురికి ప్రతిష్ఠాత్మక పురస్కారం
- ఫెర్రి అగోస్తిని, అన్నె ఎల్ హ్యులియర్, ఫెరెన్స్ క్రౌజ్‌ను వరించిన అవార్డు



ఫెర్రి అగోస్తిని | ఫెరెన్స్ క్రౌజ్ | అన్నె ఎల్ హ్యులియర్

స్టాకోహోమ్, అక్టోబర్ 3: భౌతికశాస్త్రంలో ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం ఈ ఏడాది ముగ్గురు శాస్త్రవేత్తలను వరించింది. ఫెర్రి అగోస్తిని, ఫెరెన్స్ క్రౌజ్, అన్నె ఎల్ హ్యులియర్ సంయుక్తంగా భౌతికశాస్త్రంలో నోబెల్ ప్రైజ్‌ను అందుకోనున్నారు. అణువు, పరమాణువుల్లోని ఎలక్ట్రాన్స్ డైనమిక్స్‌లపై పరిశోధనలు చేసేందుకు కాంతి తరంగాల ఆటోసెకండ్ పల్స్‌ను ఉత్పత్తి చేసే పద్ధతిని అభివృద్ధి చేసినందుకు గానూ వారు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వెల్లడించింది. అణువులు, పరమాణువుల్లోని ఎలక్ట్రాన్స్‌లపై అధ్యయనం చేసేందుకు పరిశోధకులు సరికొత్త పరికరాన్ని ప్రపంచానికి అందజేశారని అకాడమీ తెలిపింది.

**భౌతికశాస్త్రంలో ఐదో మహిళకు పురస్కారం...**

ఫెర్రి అగోస్తిని (ఓహియో స్టేట్ యూనివర్సిటీ, అమెరికా), ఫెరెన్స్ క్రౌజ్ (లాడ్విగ్ మాక్సిమిలియన్ యూనివర్సిటీ ఆఫ్ మ్యూనిచ్,జర్మనీ), అన్నె ఎల్ హ్యులియర్ (ల్యూండ్ యూనివర్సిటీ, స్వీడన్) ఆటోసెకండ్‌పై పరిశోధనలు చేశారు. హ్యులియర్ భౌతికశాస్త్రంలో నోబెల్ అందుకుంటున్న ఐదో మహిళ కావడం విశేషం. ఈ ముగ్గురు నోబెల్ పురస్కారంతో పాటు 11 మిలియన్ల స్వీడిష్ క్రోనర్, బంగారు పతకం అందుకోనున్నారు. డిసెంబర్ 10న స్టాక్‌హోమ్‌లో ఈ అవార్డును అందజేస్తారు. గతేడాది కూడా ముగ్గురు పరిశోధకులు భౌతికశాస్త్రంలో నోబెల్ పురస్కారం అందుకున్నారు.

### ఏమిటీ ఆటోసెకండ్?

ఆటోసెకండ్ అనేది సంక్షిప్త సమయం. ఇది సెకనులో ఒక క్వింటిలియన్ వంతుకు (10 టు ది పవర్ ఆఫ్ 18 సెకండ్స్) సమానం. విశ్వాన్ని నియంత్రించే ప్రాథమిక శక్తులు (ఫండమెంట్ ఫోర్సెస్) గురించి తెలుసుకునేందుకు ఉపయోగించే అనంతమైన సంక్షిప్త సమయమే ఆటోసెకండ్. ఆటోసెకండ్ పల్స్‌ను అతి తీవ్రత గల లేజర్ వ్యవస్థను ఉపయోగించి ఉత్పత్తి చేస్తారు. పరమాణు, పరమాణు భౌతికశాస్త్రంలో వీటిని విరివిగా వినియోగిస్తారు. ఆటోసెకండ్ పల్స్‌తో ఇప్పటివరకు మన కంటికి కనిపించని అనేక ప్రక్రియలను చూసే వీలు కలిగింది. ఎలక్ట్రాన్ల క్వాంటమ్ మెకానికల్ స్వభావం, రసాయనిక ప్రతిచర్యల సమయంలో ఒకదానితో మరొకటి సంకర్షణ జరుగుతున్నప్పుడు జరిగే మార్పులను దీని ద్వారా గమనించవచ్చు. ఆటోసెకండ్ పల్స్‌లను ఉపయోగించి ఎలక్ట్రాన్లను స్తంభింపజేయవచ్చు. ఆటోసెకండ్ పరిమాణ సమయంలో అణువులు, పరమాణువుల్లోని ఎలక్ట్రాన్ల డైనమిక్స్‌ను సంగ్రహించవచ్చు. ఆటోసెకండ్ సైన్స్‌ను ఉపయోగించి అతి నీలలోహిత (ఎక్స్‌యూవీ), ఎక్స్‌రే కిరణాలను సృష్టించవచ్చు.

## నోబెల్ గ్రహీతలకు కేటీఆర్ అభినందనలు

- డ్రూ వెస్‌మన్, కటాలిన్ కరికోపై ప్రశంసలు
- డ్రూతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న మంత్రి కేటీఆర్



హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): ఎంఆర్‌ఎన్‌ఏ వ్యాక్సిన్ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించిన డ్రూ వెస్‌మన్, కటాలిన్ కరికో నోబెల్ పురస్కారానికి ఎంపికవడంపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారక రామారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం కేటీఆర్ ఎక్స్‌లో తెలిపారు. ఈ సందర్భంగా బయో ఏషియా – 2022 సదస్సులో అమెరికాకు చెందిన పెన్సిల్వేనియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డ్రూ వెస్‌మన్‌తో వర్చువల్‌గా జరిగిన చర్చను కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. మెడికల్ సైన్స్‌లో చేస్తున్న పరిశోధనలను డ్రూ తనతో పంచుకున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. అన్ని రకాల కరోనా వేరియెంట్లను ఎదుర్కొనేందుకు ఒకటే వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు ఆయన చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పుడే అతని ప్రతిభను గుర్తించానని, ఆ విషయాన్ని స్వయంగా తెలియజేశానన్నారు. ప్రపంచ వ్యాక్సిన్ రాజధానిగా తెలంగాణ ఎదిగిన విషయాన్ని డ్రూకు వివరించానని తెలిపారు. వరల్డ్ వ్యాక్సిన్ సెంటర్‌గా భవిష్యత్తులోనూ మరింత సేవలు అందిస్తామనే విశ్వాసాన్ని వ్యక్తం చేశానని పేర్కొన్నారు. డ్రూ, కటాలిన్ భవిష్యత్తులోనూ వైద్య రంగంలో సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## యూకేలో హైదరాబాదీ హత్య

**గొడవను ఆపే ప్రయత్నంలో దారుణం**

లండన్ : యూకేలో తనకు సంబంధం లేని గొడవలో తలదూర్చి ఓ హైదరాబాదీ ప్రాణాలు పోగొట్టుకున్నాడు. వారం రోజుల్లో కూతురి పెండ్లికి ఏర్పాట్లు చేసుకున్న 65 ఏండ్ల వృద్ధుడిని కొంతమంది దారుణంగా హత్య చేశారు. లీడ్స్ వెస్ట్ యార్క్‌షైర్‌లో హిల్ టాప్ ఎవెన్యూ వద్ద మహమ్మద్ ఖాజా రయీసుద్దీన్‌ను శనివారం ఇద్దరు హత్య చేశారు. ఉగాండా వాసులుగా అనుమానిస్తున్న ఇద్దరు వ్యక్తులు నేపాల్ వ్యక్తితో ఘర్షణకు దిగారు. గొడవను ఆపేందుకు ప్రయత్నించిన రయీసుద్దీన్ కత్తిపోట్లకు గురయ్యారు. తీవ్రంగా గాయపడిన ఆయనను దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందారు. నిందితులిద్దరినీ అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. 2011 నుంచి లండన్‌లో నివసిస్తున్న రయీసుద్దీన్‌కు భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. అక్టోబర్ 5న హైదరాబాద్‌లో జరిగే కుమార్తె వివాహానికి వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటుండగా ఈ ఘోరం జరిగింది. రయీసుద్దీన్ కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లో నివాసముంటున్నారు.

## సాయుధ బలగాల్లో సంక్షోభం

***2018-22 మధ్య 50 వేల మంది రాజీనామా.. 654 మంది ఆత్మహత్య***



న్యూఢిల్లీ, అక్టోబర్ 3: కేంద్ర సాయుధ పోలీసు బలగాల్లో(సీఏపీఎఫ్) సంక్షోభం నెలకొన్నది. పలు కారణాలతో వందలాది మంది సిబ్బంది ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. వేలాది మంది ఉద్యోగాలకు రాజీనామాలు చేసి బయటకు వెళ్లిపోతున్నారు. 2018 నుంచి 2022 వరకు మధ్య ఐదేండ్ల వ్యవధిలో 654 మంది సీఏపీఎఫ్ సిబ్బంది ఆత్యహత్య చేసుకొన్నారని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. అంటే గత ఐదేండ్లుగా మూడు రోజులకు ఒకరు చొప్పున బలవన్మరణానికి పాల్పడున్నట్టు లెక్క. మరోవైపు ఇదే ఐదేండ్ల కాలంలో 50,155 మంది సీఏపీఎఫ్ సిబ్బంది తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. ఆత్మహత్యలకు వ్యక్తిగత, కుటుంబ కారణాలు, మానసిక సమస్యలు కారణమని అధికారులు చెబుతున్నారు. ప్రమాదకరమైన ఏరియాల్లో విధులు, క్లిష్టమైన వాతావరణ పరిస్థితులు, విశ్రాంతి లేని డ్యూటీలు, కుటుంబం నుంచి దూరంగా ఉండటం, సెలవులు సరిపోకపోవడం, పదోన్నతులకు పరిమిత అవకాశాలు వంటి కారణాలతో అధికారులు రాజీనామా చేస్తున్నట్టు పేర్కొన్నారు.

**పార్లమెంటరీ కమిటీ ఆందోళన**

పెరుగుతున్న సాయుధ బలగాల సిబ్బంది ఆత్మహత్యలపై హోంశాఖ వ్యవహారాల పార్లమెంటరీ కమిటీ కూడా గతంలో ఆందోళన వ్యక్తం చేసింది. చాలా మంది సీఏపీఎఫ్ సిబ్బంది క్లిష్టమైన పని పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఈ ఏడాది మార్చిలో రాజ్యసభకు సమర్పించిన నివేదికలో పేర్కొన్నది. ఈ నేపథ్యంలో సిబ్బందిని బలగాల్లోనే కొనసాగేలా, వారిలో మనోస్థైర్యం నింపేలా వారి పని పరిస్థితులను మెరుగుపరిచేందుకు అత్యవసరంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని సూచించింది.

### ఆత్మహత్యలు, రాజీనామాలు ఇలా..

**కేంద్రసాయుధ పోలీసు బలగాలు**

1. సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్(సీఆర్పీఎఫ్)
2. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్)
3. ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసు(ఐటీబీపీ)
4. నేషనల్ సెక్యూరిటీ గార్డ్(ఎన్ఎస్‌జీ)
5. సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ)
6. అస్సాం రైఫిల్స్(ఏఆర్)
7. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)

2018-22 మధ్య ఆత్మహత్య చేసుకున్న సిబ్బంది- 654 మంది
స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసిన వారు- 50,155

**బలగాల్లో అత్యధిక మరణాలు**

| | |
|---|---|
| సీఆర్పీఎఫ్ | 230 |
| బీఎస్ఎఫ్ | 174 |
| సీఐఎస్ఎఫ్ | 89 |

**ఏడాది వారీగా బలవన్మరణాలు**

| | |
|---|---|
| 2018 | 96 |
| 2019 | 129 |
| 2020 | 142 |
| 2021 | 157 |
| 2022 | 130 |

**బలగాల రాజీనామాలు**

| బీఎస్ఎఫ్ | సీఆర్పీఎఫ్ | సీఐఎస్ఎఫ్ |
|---|---|---|
| 23,553 | 13,640 | 5,876 |



## యూపీలో డాక్టర్ హత్యతో కలకలం

**బీజేపీ నేత నేతృత్వంలో మూక హత్య**

సుల్తాన్‌పూర్: యూపీలోని సుల్తాన్‌పూర్‌లో భూ వివాదంలో ఒక డాక్టర్‌ను కొట్టి చంపడం తీవ్ర కలకలం సృష్టించింది. ఘన్‌శ్యామ్ తివారీ (53) అనే డాక్టర్‌ను బీజేపీ నేత ఆధ్వర్యంలో కొందరు కొట్టి చంపారు. బీజేపీ నాయకుని నేతృత్వంలో జరిగిన ఈ మూక హత్యపై యూపీలోని యోగి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. నిందితుడిపై ఇప్పటికే మూడు క్రిమినల్ కేసులున్నాయని, మరో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులపై కూడా కేసులు నమోదు చేసినట్టు సుల్తాన్‌పూర్ ఎస్పీ సోమెన్ బర్మ తెలిపారు. ఇదిలా వుండగా యూపీ ప్రభుత్వం పలువురు ఉన్నతాధికారులను బదిలీ చేసింది.

## అస్సాంలో ముస్లింల స్థితిగతులపై సర్వే

గువాహటి, అక్టోబర్ 3: రాష్ట్రంలోని ఐదు ముస్లిం కులాల సామాజిక-ఆర్థిక స్థితిగతులపై సర్వే చేయాలని అస్సాం ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎం హిమంత బిశ్వ శర్మ అధికారులను ఆదేశించారు. ముస్లిం వర్గాలైన గోరియా, మోరియా, దేశీ, సయ్యద్, జోల్హాల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై సర్వే చేసి నివేదిక సమర్పించాలని మంగళవారం ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. దీనిపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. ఇది బీజేపీ విభజన కుట్రలో భాగమని ఆరోపించాయి.

## పైలట్లు మౌత్‌వాష్, పెర్ఫ్యూమ్స్ వాడొద్దు!

న్యూఢిల్లీ : విమాన పైలట్లు, ఇతర సిబ్బంది మౌత్‌వాష్, పెర్ఫ్యూమ్స్ వాడకంపై డీజీసీఏ నిషేధం విధించనుంది. ఈమేరకు కొత్త నిబంధనావళిని తీసుకొస్తున్నది. మౌత్ వాష్, పెర్ఫ్యూమ్స్‌లో ఆల్కహాల్ శాతం ఎక్కువగా ఉంటుందని, దీని వల్ల పైలట్లు, ఇతర సిబ్బందికి చేసే 'బ్రీత్ ఎనలైజర్ టెస్ట్' ప్రభావితమవుతున్నదని డీజీసీఏ భావిస్తున్నది. 'ఆల్కహాల్ ఉత్పత్తులు వాడితే బ్రీత్ ఎనలైజర్ టెస్ట్‌లో పాజిటివ్ రావడానికి ఆస్కారముంది. ఆల్కహాల్‌తో కూడిన ఔషధాలు వాడేవారు.. ముందస్తుగా అనుమతి పొందాలి' అని డ్రాఫ్ట్‌లో డీజీసీఏ పేర్కొన్నది.

## ఎలక్ట్రిక్ డిటోనేటర్లపై కేంద్రం నిషేధం

**2025 ఏప్రిల్ 1 నుంచి అమలు**

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: ఎలక్ట్రిక్ డిటోనేటర్ల తయారీ, దిగుమతి, వాటిని కలిగి ఉండటంపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. 2025 ఏప్రిల్ 1 నుంచి ఇది అమల్లోకి రానుంది. ప్రజా రక్షణ, భద్రతా పరమైన అంశాల్ని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్రం తెలిపింది. వీటి వినియోగం అత్యంత ప్రమాదకరమైనదిగా పేర్కొంటూ డీపీఐఐటీ మంగళవారం నోటిఫికేషన్ జారీచేసింది. నిర్మాణ రంగం, గనుల తవ్వకం, క్వారీ పరిశ్రమల్లో ఎలక్ట్రిక్ డిటోనేటర్లను భారీగా వినియోగిస్తున్నారు. పరిశ్రమ వర్గాలతో సంప్రదింపులు జరిపామని, డిటోనేటర్ల ఉత్పత్తిని 2024–2025 నాటికి పూర్తిగా నిలిపివేయాలని నిర్ణయించినట్టు కేంద్రం తెలిపింది.

## రైల్వే కొత్త టైం టేబుల్ విడుదల

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: రైళ్ల కొత్త టైం టేబుల్‌ను రైల్వే మంత్రిత్వ శాఖ మంగళవారం విడుదల చేసింది. ఇందులో 64 వందే భారత్ రైళ్లతో పాటు మరో 70 ఇతర రైల్వే సర్వీసులను చేర్చారు. 'ట్రైన్స్ ఎట్ గ్లాన్స్(టీఏజీ)' పేరుతో విడుదల చేసిన ఈ రైల్వే కొత్త టైమ్ టేబుల్ ఈ నెల 1 నుంచే అమలవుతున్నది. ప్రయాణికులు కొత్త డిపార్చర్, అరైవల్ సమయాలను చెక్ చేసుకోవాలని సూచించింది. 90 రైళ్ల సర్వీసుల గమ్యస్థానాలను పెంచగా, 22 రైళ్ల వేగాన్ని పెంచి సూపర్‌ఫాస్ట్ క్యాటగిరీలోకి మార్చారు.

## సీఐసీ వైకే సిన్హా పదవీ విరమణ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ) వైకే సిన్హా మంగళవారం పదవీ విరమణ చేశారు. తదుపరి సీఐసీని కేంద్ర ప్రభుత్వం ప్రకటించాల్సి ఉంది. తన పదవీ కాలంలో సిన్హా పెండింగ్ కేసుల సంఖ్యను 50 శాతానికిపైగా తగ్గించారు. సమాచార కమిషన్‌లో ప్రస్తుతం ఒక సీఐసీ, నలుగురు కమిషనర్లు ఉన్నారు. సిన్హా పదవీ విరమణతో నలుగురు కమిషనర్లే ఉన్నారు. వీరి పదవీకాలం నవంబర్‌తో ముగుస్తుంది.

## ఢిల్లీలో భూ ప్రకంపనలు

న్యూఢిల్లీ: పొరుగు దేశమైన నేపాల్‌లో గంట వ్యవధిలో సంభవించిన నాలుగు భూకంపాల ప్రభావం మన దేశ రాజధాని ఢిల్లీపై కూడా తీవ్రంగా చూపింది. రెండోసారి వచ్చిన భూకంపంతో ఢిల్లీ,-ఎన్‌సీఆర్ పరిధిలో భూమి కంపించింది. భూప్రకంపనలతో ప్రజలు కార్యాలయాలు, ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఇంట్లోని ఫ్యాన్లు, లైట్లు ఊగాయని, టీవీ స్క్రీన్‌లు, వస్తువులు కదిలాయని స్థానికులు తమ అనుభవాలను వివరించారు. భూకంప ప్రభావం ఉత్తరాఖండ్, యూపీలోని కొన్ని ప్రాంతాలలో చూపింది.

## 10లోగా 41 మంది దౌత్యసిబ్బందిని తగ్గించండి: భారత్

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: కెనడా దౌత్యవేత్తలకు భారత్ మరో హెచ్చరిక జారీ చేసింది. తమ దేశంలోని 41మంది దౌత్యవేత్తలను ఈ నెల 10లోగా ఉపసంహరించుకోవాలని ఆదేశించింది. లేకుంటే వారు తక్షణం ఆ హోదాను కోల్పోతారని హెచ్చరించింది. మనదేశంలో కెనడా దౌత్యవేత్తలు 60 మంది ఉన్నారు. ఖలిస్థాన్ ఉగ్రవాది నిజ్జర్ ఈ ఏడాది జూన్‌లో కెనడాలో హత్యకు గురయ్యారు. ఈ హత్య వెనుక భారత్ ఇంటిలిజెన్స్ ఏజెంట్ల పాత్ర ఉందంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తీవ్ర ఆరోపణ చేసిన క్రమంలో ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి.

## ఆయాకు 80 లక్షల వేతనం

**వివేక్ రామస్వామి భారీ ఆఫర్**

న్యూయార్క్, అక్టోబర్ 3: రిపబ్లికన్ పార్టీ తరపున అమెరికా అధ్యక్ష అభ్యర్థి రేసులో ఉన్న వివేక్ రామస్వామి తన పిల్లల సంరక్షణ కోసం ఆయాను నియమించుకోవాలని అనుకొంటున్నారు. ఈ ఉద్యోగానికి ఆయన ఏకంగా లక్ష డాలర్ల (రూ.80 లక్షల)కు పైగా వేతనాన్ని ఇవ్వజూపుతున్నట్టు తెలుస్తున్నది. భారత సంతతికి చెందిన వివేక్, అపూర్వ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరి సంరక్షణను చూసుకునే ఆయా వారానికి 84 నుంచి 96 గంటలపాటు పనిచేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత వారం మొత్తం సెలవు ఉంటుంది.